టీడీపీ మినీ పండుగ

నేడు పుట్టపర్తిలో జిల్లా మహానాడు


మినీ మహానాడు సభ ఏర్పాట్లు

పుట్టపర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి మినీ మహానాడుకు పుట్టపర్తి సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని కప్పలబండ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన మినీ మహానాడు సభ శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభంకానుంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరుకానున్నారు. ఉదయం ప్రతినిధుల నమోదు, తర్వాత టీడీపీ జెండా ఆవిష్కరణ, ఎన్టీఆర్‌కు నివాళి సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం నియోజకవర్గాల తీర్మానాలపై చర్చిస్తారు. సభలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, ఎన్టీఆర్ ఆశయాలు, పార్టీ విధానాలు, ఎదుర్కొన్న సంక్షోభాలు, విజయాలతోపాటు బడుగు, బహీనవర్గాల రాజకీయ ప్రాతినిధ్యం, కార్యకర్తల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిలో సీఎం చంద్రబాబు చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారు. ఆయా నియోజకవర్గ మినీ మహానాడుల్లో చేపట్టిన తీర్మానాలను శనివారం జిల్లా మహానాడు వేదికగా చర్చిస్తారు. జిల్లా అభివృద్ధిపై పలు తీర్మానాలు చేసి ఈనెల 27నుంచి 29 దాకా కడపలో నిర్వహించే మహానాడులో ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలో కేంద్రంలో నిర్వహిస్తున్న మినీ మహానాడుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఎద్దఎత్తున నేతలు, పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే రహదారులన్నీ స్వాగతతోరణాలతో పసుపు మయం చేశారు.

ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత, పల్లె రఘునాథరెడ్డి, అంజినప్ప

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మినీ మహానాడు సభ ఏర్పాట్లను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప, కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు శుక్రవారం పరిశీలించారు. మహానాడుకు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు భారీ తరలివస్తున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. సభకు వచ్చే పార్టీ నేతలు, శ్రేణులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ పంపిణీపై పౌరసరఫరాల శాఖాధికారులు, సీఎస్‌డీటీలతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సీఎస్‌డీటీలు నిత్యం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. 1నుంచి 15వ తేదీ వరకు రోజూ డీలర్లు నిర్ణీత సమయంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఒకట్రెండు రోజులు ఇచ్చి తరువాత నిలిపివేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 60 సంవత్సరాలు పైబడిన దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.


సాగుకు సిద్ధం చేసుకున్న పొలం

ఐదెకరాలకు సరిపడా విత్తనం అందించాలి



నాకు 8 ఎకరాల పొలం ఉంది. నాలుగు నుంచి ఐదు ఎకరాలు ఉన్న రైతులు పూర్తి స్థాయిలో వేరుశనగను సాగు చేసేందుకు బయటి మార్కెట్‌లో అధికధరకు వేరుశనగను కొనుగోలు చేస్తున్నారు. నేను ఆర్థిక ఇబ్బందుల కారణంగా బయటి మార్కెట్‌లో రెండు మూడు ఎకరాలకు సరిపడ విత్తన కాయలు మాత్రమే కొనుగోలు చేశా. ప్రభుత్వం త్వరగా సబ్సిడీపై విత్తన వేరుశనగ పంపిణీ చేస్తే మళ్లీ కొనుగోలు చేస్తా.

- మారెప్ప, రైతు, బిజిహళ్లి

విత్తన సమస్య

● ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్ ● సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతుల ఎదురుచూపు

మడకశిర, మే 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు సమయం సమీపిస్తున్నా విత్తన వేరుశనగ దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సేద్యపు పనులు ప్రారంభించారు. సంబంధిత యంత్రాంగం మాత్రం విత్తన వేరుశనగ ఊసే ఎత్తడం లేదు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధర పెట్టి కొనలేక, ప్రభుత్వ సబ్సిడీ విత్తన కాయల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాకు గత ఏడాది కంటే ఈ ఏడాది దాదాపు 30 వేల క్వింటాళ్ల కాయలు తక్కువ కేటాయించినట్లు సమాచారం.

జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో వేరుశనగను సాగుచేయనున్నారు. ప్రస్తుతం జిల్లాకు 63918 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించినట్లు తెలిసింది. గత సంవత్సరం జిల్లాలో 94 వేల క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేశారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కూడా మరింత విత్తన వేరుశనగ కేటాయించే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం వేరుశనగకు 40 శాతం సబ్సిడీని ప్రకటించింది.

ముందస్తు సాగుకు రైతన్నలు సిద్ధం

ఇటీవల ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు ముందస్తు సాగుకు సిద్ధం అవుతున్నారు. పొలాలను దుక్కులు చేసి సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రతిఏటా సంభవించే నష్టాలతో వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. పదేళ్ల కిందట మడకశిర నియోజకవర్గంలో 42 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల ఇతర కారణాలతో అది ప్రస్తుతం 30వేల హెక్టార్లకు పడిపోయింది. కాగా ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ అరెకరా, ఎకరా ఉన్న రైతులకు మాత్రమే సరిపోతుందని, ఐదెకరాల రైతుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ

జిల్లాకు 63918 కింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించింది. వర్షాలు వస్తే జూన్ నుంచి విత్తనాలు విత్తుకోవచ్చు. వేరుశనగ ప్రాసెసింగ్ మొదలైంది. రైతు సేవా కేంద్రాలకు వేరుశనగను సరఫరా చేస్తాం. ఈ నెలాఖరు నుంచి వేరుశనగను రైతులకు పంపిణీ చేస్తాం. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని ఇస్తోంది.

-సుబ్బారావు, వ్యవసాయశాఖ జేడీ


విత్తనకాయల సంచుల తూకాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

నాణ్యమైన విత్తన కాయలు సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బరావు

ధర్మవరం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు విత్తన ఏజెన్సీకి సూచించారు. పట్టణంలోని శ్రీసాయి సీడ్స్ వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ సెంటర్‌ను జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సనావుల్లా, జిల్లా ఏపీసీడ్స్ మేనేజర్ సుబ్బయ్యతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాసెసింగ్ జరుగుతున్న విత్తనకాయల నాణ్యతను పరిశీలించి తూకాలను తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, ఇప్పటివరకు ఎంతవరకు ప్రాసెసింగ్ చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రైతు సేవ కేంద్రాలలో విత్తన వేరుశనగ కాయలు నిల్వ ఉంచాల్సిందిగా ఏపీసీడ్స్ డీఎంను ఆదేశించారు. త్వరలోనే రైతులకు విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాఫ, ఏఈఓ అశ్విని, ఏపీసీడ్స్ సిబ్బంది వినయ్, ప్రాసెసింగ్ ప్లాంట్ యాజమానులు పాల్గొన్నారు.

సారూ..! వీటిని మార్చండి

● నడిరోడ్లపై విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు ● తొలగించాలంటున్న మడకశిర ప్రజలు


పావగడ - మధుగిరి రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం

మడకశిరటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం-హిందూపురం, మధుగిరి- పావగడ ప్రధాన రహదారి, మధుగిరి సర్కిల్లో ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లపై మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటం వల్ల గతంలోనే అనేక ప్రమాదాలు జరిగాయి. పట్టణంలోని అమరాపురం రోడ్డు, బస్టాండు, వెంకటేశ్వర కళాశాల సమీపం, పాత కర్ణాటక బ్యాంక్ పెట్రోల్ బంకు సమీపంలో విద్యుత్ స్తంభాలు రోడ్డుపైనే ఉన్నాయి. వాహనదారులు అదమరిస్తే విద్యుత్ స్తంభాలను ఢీకొనే ప్రమాదం ఉంది. మధుగిరి రోడ్డు సర్కిల్లో ఉన్న పెద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చొరవతో పక్కకు మార్చారు. దీన్ని మార్చాలని గతంలో ఎందరినో వేడుకున్న ఫలితం లేకపోయింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆ ట్రాన్స్‌ఫార్మర్ వేరేచోటుకు తరలించారు. అలాగే నిత్యం పావగడ, మధుగిరి, హిందూపురం-అమరాపురం ప్రాంతాలకు అనేక వాహనాలు వెళ్తూ రోడ్లు రద్దీగా ఉంటాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


అమరాపురం రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు

కరోనా మామూలు జబ్బే

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్ బేగం



పుట్టపర్తి రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కరోనా మామూలు జబ్బేననీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కరోనా.. దగ్గు, జలుబు, జ్వరంతో కూడిన సాధారణ రుగ్మత అనీ, ఆరోగ్యసూత్రాలు పాటిస్తే నయమవుతుందన్నారు. కరోనా సమయంలో తరహాలోనే జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందన్నారు. గర్భవతులు, వృద్ధులు, మధుమేహం, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్, టీబీ తదితర జబ్బులున్నవారు రద్దీ ప్రదేశాలకు వెళ్లకుండా ఉండాలన్నారు. కరచాలనం చేయవద్దన్నారు. రద్దీ ప్రదేశాల్లోకి వెళ్లాల్సి వస్తే మాస్కు తప్పనిసరిగా ధరించాలన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. తుమ్మినపుడు, దగ్గినపుడు మోచేయిగానీ, టిష్యూ పేపర్‌గానీ, రుమాలుగానీ అడ్డుగా ఉంచుకోవాలన్నారు. భౌతిక దూరం పాటించడం మంచిదన్నారు. జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి, వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి వివరించారు.

ఉద్యోగం వదిలి సేద్యపు బాట



● సేంద్రియ పద్ధతిలో అరటి సాగు
● లాభాలు గడిస్తున్న మంగాపురం రైతు

(6వ పేజీలో..)

పిట్ట కథ..!


ఆకలైతాంది.. అమ్మా నాయిన ఎప్పుడొస్తారో ఏమో..!


ఏమీ దొరకలేదు బుజ్జీ.. అట్లా అలిగితే ఎట్లా..?


పసిదానికి ఆకలైతాందంట..
ఏమైనా తెచ్చేదుండా.. లేదా..?


బుద్ది లేక పెండ్లి చేసుకుండా..!
పోతాండా ఉండు..!


ఇదిగో తెచ్చినా.. తిను..!


అంతేలే.. మీరు మీరు పాముకోండి..!


నిన్ని ఇడిసిపెట్టి ఎట్ల తింటా చెప్పు బుజ్జీ..? ఇది నీకే..

(బుక్కరాయసముద్రం చెరువులో..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

బదిలీలపై ఉత్కంఠ!

- అనుకూల ప్లేస్‌ల కోసం ఉద్యోగుల యత్నాలు
- ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు
- ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు
- అయినా.. దక్కుతుందో లేదోనన్న సందేహాలు



అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు పచ్చజెండా ఊపింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కొన్ని బదిలీలు జరిగినా అపుడు వివిధ మార్గదర్శకాలు అమలు చేయడంతో అనుకున్నవారు రాలేకపోయారు. ఎవరనీ కదపలేకపోయారు కూడా. దీంతో వైసీపీ హయాంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులే చాలా శాఖల్లో ఉంటూ హవా సాగిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ పనిచెప్పినా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇదే విషయంపై ప్రజాప్రతినిధుల వద్ద టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇపుడు మొత్తం అన్నిశాఖల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పుడైనా తమకు అనుకూలమైన వారిని నియమించుకోవాలని ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు ఆరాట పడుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు సైతం తమకు అనుకూలమైన ప్లేస్‌లకు వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ కొన సాగుతున్నా. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, జడ్పీ, ఎంపీడీఓలు, వివిధ శాఖల ఇంజనీర్లు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని, ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావారీగా రెవెన్యూ బదిలీలు

కీలకమైన శాఖ రెవెన్యూ. దీంతో ప్రజాప్రతినిధులు కూడా ఈ శాఖలో తమకు అనుకూలంగా ఉండేవారినే నియమించుకుంటారు. ఎంపీడీఓల నియామకంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ బదిలీలు ఉమ్మడి జిల్లావారీగా చేపట్టనున్నారు. రెవెన్యూశాఖ బదిలీలే హాట్‌టాపిక్‌గా మారాయి. ఆ బదిలీలకు ఉమ్మడి అనంత జిల్లా కలెక్టరే ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కింది స్థాయి కేడర్ల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్వో ఆధ్వర్యంలో చేపడతారు. ఆ మేరకు బదిలీలు చేయడానికి యంత్రాంగం కసరత్తు మొదలెట్టింది.

ఆశావహుల్లో ఉత్కంఠ

బదిలీలపై పెద్దఎత్తున పైరవీలు చేయించుకుంటుంటే కలెక్టర్ వినోద్‌కుమార్ మాత్రం నిబంధనల మేరకే చేస్తామని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొన్నిశాఖల్లో బదిలీలు జరిగినపుడు కూడా జిల్లాలో నేతలు ప్రతిపాదించిన వారికి పోస్టింగ్స్ ఇవ్వలేదు. అప్పట్లో దీనిపై ప్రజాప్రతినిధుల నుంచి కూడా అసంతృప్తి వ్యక్తమైంది. అప్పటికప్పుడు కొందరి పోస్టింగ్‌లను మార్చి ఇచ్చారు. ఇపుడు మళ్లీ కలెక్టర్, జేసీ నిబంధనలు అంటూ సిఫార్సు లేఖలను పక్కనపెడతారేమోనన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాము కోరుకున్న స్థానాన్ని దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతల నుంచి ఉన్నతాధికారులపై ఒత్తిడి పెట్టిస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి మరి.

ఉద్యోగం వదిలి సేద్యపు బాట



అరటిలో లాభాలు బాగున్నాయ్

గతంలో నేను బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో పీఆర్‌ఓగా పని చేసేవాడిని. రూ.30వేలు జీతం వచ్చేది. ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాకున్న సొంత భూమిలో సేంద్రియ పద్ధతిలో అరటి, బొప్పాయి, వక్క ఇలా తొమ్మిది రకాల పంటలను సాగుచేశా. యాలక్కి రకం అరటి సాగులో నాలుగుసార్లు కోత కోయగా 5టన్నులు దిగుబడి వచ్చింది. కిలో రూ.40నుంచి రూ.50దాకా పలికింది. పెట్టుబడులు అన్నీ వచ్చేశాయి. ఇంకా మూడు కోతలు అవుతాయి. అదంతా లాభమే.

- గోపాల్‌రెడ్డి, రైతు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అరటి గెలలు

- సేంద్రియ పద్ధతిలో అరటి సాగు
- లాభాలు గడిస్తున్న మంగాపురం రైతు


సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన బొప్పాయి

పెనుకొండ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై మక్కువ ఉన్నా తీవ్ర కరువు నేపథ్యంలో సాగు నీరు లేక ఓ యువకుడు పొట్టకూటి కోసం వలస వెళ్లాడు. కాల ప్రవాహంలో రెండు దశాబ్దాలు గడిచిపోయాయి. జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు రావడం, గొలపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యువకుడిగా వెళ్లిన ఆయన నడివయసులో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సేంద్రియ సేద్యం ప్రారంభించాడు. లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా మారాడు. ఆయనే మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి.

బెంగళూరు నుంచి వచ్చి..

గ్రామంలో కరువు పరిస్థితులు ఉండటంతో రెండు దశాబ్దాల కిందట గోపాల్‌రెడ్డి బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ మెడికల్ పీఆర్‌ఓగా పని చేసేవాడు. నెలకు రూ.30 వేలదాకా జీతం లభించేది. మనసు మాత్రం ఎప్పుడు ఊరిపైనే ఉండేది. ఈక్రమంలోనే జిల్లాలో పరిస్థితులు మారాయి. కృష్ణా జలాలతో చాలా ప్రాంతం సస్యశ్యామలం కాసాగింది. ఇది గమనించిన గోపాల్‌రెడ్డి రెండేళ్ల కిందట ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామం చేరుకున్నాడు. తనకున్న 3.5ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో అరటి సాగు చేశాడు. దిగుబడులు బాగా రావడమే కాకుండా గిట్టుబాటు ధర లభించడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. అరటిలో అంతర పంటలుగా బొప్పాయి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, మునగ, కంది, వక్క సాగుచేశాడు. ఒక్కో అరటి మొక్కను రూ.30చొప్పున కొనుగోలు చేసి 2వేల మొక్కలు నాటాడు. పంట సాగు, కూలీలు, ఎరువుల కోసం దాదాపు రూ.2.10లక్షలు ఖర్చుచేశాడు. పంట దిగుబడి బాగా వచ్చిందన్నారు. ఒక్కో గెల 8కిలోల నుంచి 12కిలోలు వచ్చిందన్నారు. ఇప్పటిదాకా పెట్టుబడి మొత్తం వచ్చిందన్నారు. ఇంకా రెండు మూడు కోతలు వస్తాయని, అదంతా అదనపు లాభమేనని ఆనందం వ్యక్తం చేశారు.


స్వరూప్


సాయికుమార్


విరూపాక్షరెడ్డి


రాజు

గ్రేడ్-2 వీఆర్వోల జిల్లా కమిటీ ఎంపిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికుమార్, విరూపాక్షరెడ్డి

అనంతపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం అసోసియేషన్ జిల్లా అడహక్ కమిటీని ఎంపిక చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విరూపాక్షరెడ్డి కోశాధికారిగా రాజు, వైస్‌ప్రెసిడెంట్లుగా నరేష్‌కుమార్, కుమారస్వామి, రాఘవేంద్రరాజు, సహాయ కార్యదర్శులుగా అనిల్, అశోక్‌కుమార్, రఘుయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పురుషోత్తం, లిఖిత, ఈసీ మెంబర్లుగా సయ్యద్, ఆఫ్రిది, వెంకట రాజేష్, దిల్షాద్, వీరేష్, ఆదినారాయణ, నీలకంఠరెడ్డిలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వరూప్ మాట్లాడుతూ జిల్లా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లాలో త్వరితగతిన సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతామన్నారు. డివిజన్ కమిటీలు పూర్తి చేస్తామని వెల్లడించారు.

స్త్రీనిధి మేనేజర్‌గా సాగర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి మేనేజర్‌గా సాగర్ నియమితులయ్యారు. డీఆర్‌డీఏ-వెలుగులో స్త్రీనిధి విభాగం అత్యంత కీలకం. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇవ్వడంలో స్త్రీనిధి ముందుంటుంది. ఇదివరకు స్త్రీనిధి మేనేజర్‌గా ఉన్న హనుమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలులో స్త్రీనిధి మేనేజర్‌గా ఉన్న సాగర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శైలజను సాగర్ మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త..

- లూజు విత్తనాలు సిద్ధం చేసుకున్న దళారులు
- రైతులకు అంటగట్టే ప్రయత్నాలు
- వాటిని కొంటే నష్టాలే..
- ధ్రువీకరించిన, ప్యాక్డ్ విత్తనాలే కొనాలంటున్న వ్యవసాయాధికారులు


వరి విత్తనాలు

బొమ్మనహాళ్, మే23(ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే ప్రారంభమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మండలంలో రైతులు, వరి, మిరప, వేరుశనగ తదితర పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. సాగులో కీలకమైన విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు వహించాల్సి ఉంది. లూజు విత్తనాలను అమ్మేందుకు దళారులు సిద్ధమవుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లూజు విత్తనాలకు బదులు ప్యాకెట్‌లో ఉన్న వాటిని కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో బొల్లనగుడ్డం, దర్గాహొన్నూరు గ్రామాల్లో పొద్దుతిరుగుడు, సజ్జ నకిలీ విత్తనాల కారణంగా పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్ణాటక నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని, ఇక్కడి రైతులకు అంటగడతారని తెలుస్తోంది. కర్ణాటక, చెన్నై, ప్రాంతాల నుంచి పలు రకాల కంపెనీలకు చెందిన కవర్లను తీసుకొచ్చి, వాటిలో నింపి, రైతులకు విక్రయిస్తుంటారు. కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖాధికారులు రవాణా మధ్యలోనే చర్యలు తీసుకుంటుండడంతో నకిలీ సమస్య కొంత తగ్గింది. కొందరు దళారులు మళ్లీ లూజు విత్తనాలు విక్రయించేందకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లూజు విత్తనాలైతే..

ప్యాకెట్లలో కాకుండా విడిగా విత్తనాలను కొనుగోలు చేస్తే వాటిలో నాణ్యత ఉండదు. ఈ విత్తనాల తయారీలో కంపెనీకి చెందిన ధృవీకరణ అధికారుల ప్రమేయం ఉండదు. లూజు విక్రయాలు జరిపేవారు రైతులకు బిల్లు ఇవ్వరు. విత్తన శుద్ధి, ఇతర ప్రమాణాలు పాటించరు. ఆ విత్తనాలు సాగుచేసినపుడు పంట మధ్యలో పూత, కోత దశల్లో దెబ్బతింటే విక్రయించిన వారు బాధ్యత వహించారు. రైతులకు నష్టం తప్పదు.

గుర్తింపు పొందిన కంపెనీలవే కొనాలి

వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలి. ఆ విత్తనాల తయారీలో వివిధ దశల్లో ధ్రువీకరణ అధికారులు ఉంటారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పక ఇస్తారు. ఆ తరువాత రైతులకు నష్టం వాటిల్లితే పరిహారం వచ్చే ఆవకాశం ఉంటుంది. వ్యవసాయ శాఖ సిబ్బందితో అనుమతి పొందిన లైసెన్స్‌డ్ దుకాణల్లో విత్తనాలు కొనుగోలు చేయాలి. వ్యాపారి నుంచి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యేవరకు వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు కర్ణాటకలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లూజు విత్తనాలను తెచ్చుకుంటున్నారు. అలాంటి విత్తనాలను కొనుగోలు చేయరాదు. గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా అక్రమంగా లూజు విత్తనాలు, వివిధ కంపెనీల విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి వారు గ్రామాలకు వస్తే సమాచారం ఇవ్వండి. విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటిస్తే సాగుకు ముందే వాటిల్లే నష్టాన్ని రైతులు నివారించుకోవచ్చు.

-సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

విత్తన సబ్సిడీ ఖరారు



అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పలురకాల విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మినుములు, పెసలు, కంది, నువ్వుల విత్తనాలకు 30 శాతం సబ్సిడీ, కొర్ర, రాగులకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. బీపీటీ-5204 రకం వరి క్వింటాల్ పూర్తి ధర రూ.4300లుగా నిర్ణయించారు. ఇందులో జాతీయ ఆహార భద్రత పథకం కింద రూ.1000 సబ్సిడీ, ఇతర రైతులకు రూ.500 సబ్సిడీ వర్తింపజేశారు. మినుములు పూర్తి ధర రూ.13800లుగా నిర్ణయించారు. ఇందులో రూ.4140లు సబ్సిడీపోను రైతు వాటా రూ.9660 చెల్లించాలి. పెసలు క్వింటాల్ పూర్తి ధర రూ.13500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.4050లుపోను రైతు వాటా రూ.9450లు చెల్లించాలి. కంది క్వింటాల్ పూర్తి ధర రూ.10950లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3285లు సబ్సిడీపోను రైతు వాటా రూ.7665లు చెల్లించాలి. కొర్ర క్వింటా పూర్తి ధర రూ.6000లుగా నిర్ణయించారు. ఇందులో రూ.3000లు సబ్సిడీపోను రైతు వాటా రూ.3000లు చెల్లించాలి. రాగి క్వింటా పూర్తి ధర రూ.6900లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.3450లుపోను రైతు వాటా రూ.3450లు చెల్లించాలి. నువ్వులు క్వింటా పూర్తి ధర రూ.15500లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.6200లుపోను రైతు వాటా రూ.9300లు చెల్లించాలి. అలాగే వరి (25 కేజీల బ్యాగ్)ఐదు ఎకరాల దాకా 4 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు. కంది (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, ఉలవలు (4 కేజీల బ్యాగ్) ఐదెఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, పెసలు (4 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 10 బ్యాగ్‌లు, కొర్ర (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 5 బ్యాగ్‌లు, రాగి, నువ్వులు, (2 కేజీల బ్యాగ్) ఐదు ఎకరాల దాకా 6 బ్యాగ్‌లు పంపిణీ చేస్తారు.

ఉన్నతి స్థానం

రుణాల రికవరీలో జిల్లాకు సెకెండ్ ప్లేస్


సెర్ప్ సీఈఓ నుంచి అవార్డు అందుకుంటున్న ఉన్నత ఏపీఎం మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఎస్సీ, ఎస్టీ రుణాల రికవరీలో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ-వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాల ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి ఉన్నతి రుణాలు రికవరీ చేయడంలో మెరుగైన పురోగతి సాధించారు. జిల్లాలో పేరుకుపోయిన రూ.25.24కోట్ల రుణాలలో 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31లోపు ఏడాదిలోనే రూ.15.47కోట్లు రుణాలు రికవరీ చేశారు. దీంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం దక్కింది. ఇటీవల రాజధాని అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ నుంచి డీఆర్‌డీఏ ఉన్నతి ఏపీఎం మంజుల అవార్డు అందుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ శైలజ అవార్డు అందుకున్న ఏపీఎం మంజులను అభినందించారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తీవ్ర మనస్తాపం చెంది ధర్మవరం చెరువులో దూకి ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివానగర్‌కు చెందిన లలిత(56) కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. ఆమె కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధపడుతుండేది. ఈ క్రమంలో కుడికాలికి ఇన్ఫెక్షన్ అయి బొటన వేలు తీసేశారు. ఆ బాధ భరించలేక తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే ధర్మవరం చెరువులోకి రెండో మరువ వద్ద దూకి ఆత్మహత్య చేసుకుంది. చెరువులో శవం తేలాడుతుండడాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, చెరువులోని మృతదేహాన్ని బయటకు తీశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లలితకు భర్త గోపాల్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

మరో నిందితుడి లొంగుబాటు

రాప్తాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతు దంపతులు చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ హత్య కేసులో మరో నిందితుడు లొంగిపోయాడు. రాప్తాడు గ్రామానికి చెందిన పామళ్ల కొండప్ప శుక్రవారం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడని రాప్తాడు సీఐ శ్రీ హర్ష తెలిపారు. హత్య కేసులో నిందితులుగా ఉన్న 11 మందిలో ఇప్పటికే ఆరుగురిని ఈనెల 19న అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు. ఈనెల 21న ఈ కేసులో ఒక నిందితుడు బాల నరసింహారెడ్డి అనంతపురం కోర్టులో లొంగిపోయాడు. హత్య ఘటనలో గాయపడిన పామళ్ల కొండప్ప అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడన్నారు. అతడిని రిమాండుకు పంపామన్నారు. ఈ హత్య కేసులో మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్యకాలనీకి చెందిన శ్రావణి అనే యువతి అదృశ్యమైంది. ఆమె బీటెక్ పూర్తి చేసి, పుట్టపర్తిలో గృహనిర్మాణ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈ నెల 22వతేదీ సాయంత్రం తన తల్లి రాధమ్మతో కలిసి రెండో రోడ్డులో అద్దె ఇల్లు చూసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఓ ఇంట్లో మూడో అంతస్తుకు వెళ్లారు. తిరిగి కిందకు వచ్చే సమయంలో శ్రావణి త్వరగా దిగిపోయింది. తల్లి రాధమ్మ కిందికి వచ్చేసరికి శ్రావణి కనిపించలేదు. దీంతో ఆమె త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపే యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షను ఈనెల 25వ తేదీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2,546 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఏడు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పేపర్-1 పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఉదయం 9, మధ్యాహ్నం 2 గంటలు దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించరన్నారు. అభ్యర్థులకు సమస్య తలెత్తితే పరిష్కారంకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం 8500292992, 08554-220009 నంబర్లను ఏర్పాటు చేశామనీ, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అటవీశాఖలో బదిలీలు

● ఖాళీల జాబితాను ప్రకటించిన అధికారులు..

అనంతపురం న్యూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో బదిలీల ప్రక్రియ వేగవంతం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు సంబంధించి ఖాళీల జాబితాను కూడా యంత్రాంగం ప్రకటించింది. ఐదేళ్లు ఒకే చోట పూర్తి చేసిన వారు, వివిధ రకాల కారణాలతో బదిలీపై వెళ్లాలనుకొనే సిబ్బంది నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 9 సెక్షన్ ఆఫీసర్లు, 11 బీట్ ఆఫీసర్లతో పాటు 57 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ స్థానాలు ఖాళీ ఉన్నట్లు జాబితా ప్రకటించారు. ఐదు సంవత్సరాలు ఒకే చోట పని చేసిన ఎనిమిది మంది బీట్ ఆఫీసర్లు తప్పనిసరిగా స్థాన చలనం పొందనున్నారు. మరో నలుగురు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు కూడా ఐదేళ్లు పూర్తి చేసుకున్న జాబితాలో ఉన్నారు. దీంతో వీరికి కూడ బదిలీ తథ్యం అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. అందుకు అనుగుణంగా శుక్రవారం ఎంత సమయం అయినా జాబితా తయారు చేయాలని సిబ్బందిని డీఎఫ్ఓ ఆదేశించినట్లు తెలిసింది.

నేడు బదిలీల జాబితా..?

జిల్లా అటవీశాఖ అధికారి ఆదివారం నుంచి వ్యక్తిగత పనిపై నెలరోజుల పాటు సెలవులో వెలుతుండటంతో శనివారం క్షేత్రస్థాయి సిబ్బంది బదిలీ ప్రక్రియ పూర్తి చేసి వెళతారన్న చర్చ జరుగుతోంది. సిబ్బంది చేపట్టే చర్యలను బట్టి శనివారం బదిలీల జాబితా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నాణ్యమైన విత్తనం సరఫరా చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ
● ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాలకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలే సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి.. ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఆర్డీటీ స్టేడియం సమీపంలోని జశ్వంత్ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఆమె శుక్రవారం తనిఖీలు చేశారు. విత్తన వేరుశనగ ప్రాసెసింగ్‌తోపాటు నాణ్యతను పరిశీలించారు. ప్రాసెసింగ్ తీరుపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ... విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పక్కాగా చేయడంతోపాటు మొలక శాతాన్ని పరిశీలించి, నాణ్యమైన విత్తన కాయలను మాత్రమే పంపిణీ కేంద్రాలకు పంపాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రాకేష్‌నాయక్, ప్రాసెసింగ్ యూనిట్ పర్యవేక్షణాధికారి శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

అనంతపురం క్రైం, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్లకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో శిక్షణ ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్.. పారా లీగల్ వలంటీర్ల విధులు, వారు చేయాల్సిన పనుల గురించి వివరించారు. వలంటీర్లకు ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉచిత ప్రజాప్రయోజన న్యాయసేవలు వినియోగించుకోవాలన్నారు. న్యాయవాది హరికృష్ణ.. పారా లీగల్ వలంటీర్లకు తగిన సూచనలు చేశారు.

పైపై మెరుగులు..?

● ఎయిర్‌పోర్టులా కనిపిస్తున్న రైల్వేస్టేషన్
● గుంతకల్లు స్టేషన్ లోపలంతా డొల్లే
● శిథిలావస్థలో 70 ఏళ్లనాటి భవనం
● మరమ్మతులతో నెట్టుకొస్తున్న వైనం
● ఫలితంగా ఓ బాలుడి బలి


రైల్వే స్టేషన్‌లో శిథిలావస్థకు చేరిన 7వ ప్లాట్‌ఫాం భవన సముదాయం

గుంతకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): బయట చూడటానికి గుంతకల్లు రైల్వే స్టేషన్ ఎయిర్ పోర్టును తలపించేలా ఉంటుంది. లోపలికెళ్లి చూస్తేగాని దాని డొల్లతనం బయటపడదు. రైల్వే స్టేషన్‌లో ఏడో నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్న డెబ్బైయ్యేళ్లనాటి భవనాన్ని చూస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని మరమ్మతులతో నెట్టుకొస్తున్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటైన కొత్తలో నిర్మించిన భవన సముదాయాన్ని ఇంకా అలాగే కొనసాగిస్తున్నారు. పాత భవనాలను తొలగిస్తామంటున్న అధికారులు వాటికి ఆనుకుని కొత్త రైల్వే స్టాళ్లను నిర్మిస్తుండటాన్ని ఏమనుకోవాలో తెలియని పరిస్థితి. రైల్వే అధికారుల ఈ నిర్లక్ష్యం కారణంగా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ నిండు ప్రాణం పోయింది. రైల్వే కాంట్రాక్టరు చేసిన నాసిరకపు పని వల్ల ఓ కుటుంబానికి కడుపుకోత మిగిలింది.

1956 నాటి భవనం

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఏడో నంబరు ప్లాట్‌ఫాం ఒకప్పుడు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంగా ఉండేది. గుంతకల్లు రైల్వే డివిజన్ 1956 అక్టోబరు 2న ఏర్పాటైంది. ఆ సందర్భంగా వివిధ కార్యాలయాల నిర్వహణకు అప్పటి 1-2 నంబర్ల (ఇప్పటి 6-7 నం.) ప్లాట్‌ఫాంలపై బ్రిటీషువారు నిర్మించిన భవనంపైనే అదనపు గదులను నిర్మించారు. గతంలో ఈ భవనం పైభాగంలో ఏసీబీ, ఐఆర్‌సీటీసీ కార్యాలయాలు, టీటీఈల విశ్రాంతి గదులు, జీఆర్పీ సీఐ కార్యాలయం, తదితర కార్యాలయాలను నిర్వహించారు. రైల్వే స్టేషన్‌కు కొత్త ఎంట్రెన్స్‌ను నిర్మించిన మీదట ఏడో ప్లాట్‌ఫాం భవనాలపై ఉన్న ఆఫీసులను ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత గదులను వినియోగించకుండా వదిలిపెట్టారు. కిందన ఉన్న భవనాల్లో ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఏఎస్ఎం కార్యాలయం, జీఆర్పీ స్టేషన్, వివిధ ఆహార పదార్థాలను విక్రయించే స్టాళ్లను నిర్వహిస్తున్నారు.


పాత భవన సముదాయానికి ఆనుకుని నిర్మిస్తున్న కొత్త స్టాళ్లు


ప్లాట్‌ఫాంపై శిథిలావస్థలో ఉన్న మరో గోడ

పునర్నిర్మించే ఉద్దేశం ఉందా?

రైల్వే స్టేషన్‌లోని ఏడో నంబరు ప్లాట్‌ఫాంను పునర్నిర్మిస్తామంటూ అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం ఇప్పట్లో అది సాధ్యం కాదని చెబుతున్నాయి. ఈ ప్లాట్‌ఫాంలో ఉన్న భవన సముదాయం శిథిలావస్థలో ఉండగా, పలుమార్లు మరమ్మతులు చేసి కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ భవనాన్ని కూల్చేసి కొత్త భవనాన్ని నిర్మిస్తామంటూ గతంలో డీఆర్ఎం విజయకుమార్ ప్రకటించారు. కానీ అది సాధ్యం కాలేదు. అయితే ఇదే ప్లాట్‌ఫాంపై పాత భవనానికి ఆనుకుని కొత్త షాపుల నిర్మాణాన్ని చేపట్టారు. దీన్నిబట్టి పాత భవనాన్ని తొలగించి, పునర్నిర్మించే యోచన రైల్వే శాఖకు ఇప్పట్లో లేదని అర్థం అవుతుంది. ఈ భవనానికి ఎప్పుడూ ఏదో ఒక మరమ్మతు పనులు చేస్తూనే ఉంటారు. వెయిటింగ్ హాళ్లకు మరమ్మతులు చేసి పైకప్పునకు పీఓపీ వేసి వినియోగిస్తున్నారు. ప్రయాణికుల వేచి ఉండే గదులు బయటకు బాగానే కనిపిస్తున్నా ఎప్పుడు పైకప్పు పెచ్చులు ఊడిపడతా యోనన్న భయం వెంటాడుతోంది. పెచ్చులు ఊడిపడి శుక్రవారం ఓ బాలుడు మరణించిన వెంటనే అధికారులు స్పందించారు. ఈ భవన సముదాయాలలో వదులైన పెచ్చులను తొలగించే పనిలో పడ్డారు.

కమీషన్ల కక్కుర్తితో అనర్థం..



రైల్వేలో జరుగుతున్న పనులు అత్యంత నాసిరకంగా ఉంటున్నాయి. కాంట్రాక్టరు నిర్వాకం వల్లే రైల్వే స్టేషన్‌లో ప్రమాదం జరిగి బాలుడు మృతి చెందాడు. ఈ విషయంగా రైల్వే శాఖ బాధ్యత వహించాలి. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారాన్ని ఇచ్చి, కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగాన్ని ఇవ్వాలి. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- జగదీశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం..



డివిజనల్ హెడ్‌క్వార్టర్సులోని భవనాల పరిస్థితి ఇలా ఉండటం రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం. రైల్వే స్టేషన్‌లో ప్రమాదకర పరిస్థితులున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. వెంటనే భవన సముదాయాన్ని కూల్చి పునర్నిర్మించాలి.

- శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఆర్ఎం


పెచ్చులూడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, మే23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఏడో నంబరు ప్లాట్‌ఫాంపై పెచ్చులూడిపడి బాలుడు మరణించిన సమాచారం తెలుసుకున్న డీఆర్ఎం చంద్రశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం తెల్లవారుజామున ఏడో నంబరు ప్లాట్‌ఫాం గోడకు వేసిన ప్లాస్టింగ్ పెచ్చు ఊడి పడటంతో కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం సంఘటనా స్థలాన్ని సందర్శించి, సంబంధిత అధికారులతో చర్చించారు. బాలుడు మరణించిన సంఘటన విషయంగా వివరాలను తెలుసుకున్నారు. ప్రమాద పరిస్థితులున్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

బాలుడి మృతిపై విచారణ చేపట్టాలి

● వామపక్ష నాయకుల డిమాండ్

గుంతకల్లు, మే23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో పెచ్చులూడిపడి మరణించిన బాలుడి సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌లో బాలుడు మరణించిన ప్రదేశాన్ని సీపీఐ, సీపీఎం నాయకులు శుక్రవారం ఉదయం పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ మాట్లాడుతూ రైల్వే నిర్మాణ పనులు అత్యంత నాసిరకంగా ఉంటున్న కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదం విషయంగా రైల్వే మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలుడి మృతి సంఘటన రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, బీ మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, సీపీఎం నాయకులు మారుతీ ప్రసాద్, సాకే నాగరాజు, తిమ్మప్ప, రాము, వంశీ, కర్ల, రాజు, తదితరులు పాల్గొన్నారు.


పెచ్చులూడిన ప్రాంతాన్ని చూపుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసులు


పెచ్చులూడిన ప్రదేశాన్ని చూపుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

ఎంతపని చేశావమ్మా..!

● కుమారుడికి నిప్పుపెట్టి.. ఉరి వేసుకోబోయిన తల్లి
● అడ్డుకున్న స్థానికులు.. అప్పటికే పసివాడు బలి

బుక్కరాయసముద్రం, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడికి వైద్యం చేయించకుండా భర్త నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె ఆవేదనకు గురైంది. కొడుకుతో కలిసి బలవన్మరణానికి పాల్పడాలని భావించింది. కట్టుకునే చీరలలో తొమ్మిది నెలల పసివాడిని చుట్టి, నిప్పు పెట్టింది. తాను ఉరివేసుకునేందుకు సిద్ధమైంది. ఇంట్లోంచి పొగలు రావడంతో ఇరుగూపొరుగువారు పరుగున వెళ్లి చూశారు. ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కానీ బాలుడు చరణ్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, కంబదూరు మండలం పర్వతదేవనిపల్లికి చెందిన ఎరికల వెంకటేశ్వర్లు జీవనోపాధి కోసం బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలోని జనచైతన్య కాలనీలో ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మొదటి భార్య ఆత్మహత్య చేసుకుంది. అనంతరం కంబదూరు మండలం చెర్లోపల్లికి చెందిన వనజను రెండో వివాహం చేసుకున్నాడు. వీరి కుమారుడు చరణ్‌కు పుట్టుకతోనే జీర్ణకోశ సంబంధిత వ్యాధి సంక్రమించింది. చాలాచోట్ల చికిత్స చేయించారు. కానీ కుమారుడి వైద్యం విషయంలో భర్త నిర్లక్ష్యం వహిస్తున్నాడని వనజ గొడవ పడేది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తమ ఇంట్లో తొలుత కొడుకు చరణ్‌ను చీరలలో చుట్టి నిప్పుపెట్టింది. అనంతరం ఉరి వేసుకుంటుండగా స్థానికులు అడ్డుకున్నారు. మంటల్లో చిక్కుకున్న కుమారుడిని కాపాడుకునేందుకు వనజ ప్రయత్నించింది. మండుతున్న చీరల్లో ఉన్న కొడుకును ఎత్తుకుని బయటకు వచ్చి మురుగునీటి కాలువలో పడుకుంది. దీంతో మంటలు ఆరిపోయినా, అప్పటికే తీవ్రంగా గాయపడిన చరణ్ మృతి చెందాడు. గాయపడిన వనజను కాలనీవాసులు అనంతపురం సర్వజన వైద్యశాలలో చేర్పించారు. తన భార్య ఉద్దేశపూర్వకంగానే తన కుమారుడిని హత్య చేసిందని వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య తెలిపారు.


చరణ్ (ఫైల్)


చికిత్స పొందుతున్న వనజ

ఉగ్రవాదంపై పోరును వక్రీకరించొద్దు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


సమైక్యతా యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్.. ఉగ్రవాదంపై పోరులో భాగంగానే పాకిస్థాన్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిందనీ, దానిని మతాల మధ్య పోరాటంగా మలచొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీ వరకు చేపడుతున్న సమైక్యతా యాత్ర కరపత్రాలను స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. రాంభూపాల్ మాట్లాడుతూ... పహల్గాంలో పర్యాటకుల మతాన్ని తెలుసుకుని కాల్పులు జరపడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టాలని పథకం పన్నారన్నారు. దీనిని దేశప్రజలు సమైక్యంగా తిప్పికొట్టారన్నారు. కొన్ని మతోన్మాదశక్తులు.. ఉగ్రవాదానికి మతంతో ముడివేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని వాపోయారు. ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, మూర్తుజా పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి: ఈఎస్

అనంతపురం అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు మద్యం షాపులు, బార్ల నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆదేశించారు. సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి శుక్రవారం ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల దాకా మాత్రమే తెరవాలన్నారు. బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల దాకా విక్రయాలు చేసుకోవాలన్నారు. మద్యం షాపులు, బార్లల్లో సమయపాలన పాటించేలా రాత్రి సమయాల్లో ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జడ్పీ సీఈఓపై బదిలీ వేటు

● ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు
● డిప్యూటీ సీఈఓకు ఎఫ్ఏసీ బాధ్యతలు


బదిలీ అయిన సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం విద్య, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డిపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 396ను శుక్రవారం విడుదల చేసింది. డిప్యూటీ సీఈఓకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. సీఈఓ రామచంద్రారెడ్డిని ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లో జగన్ ఫొటో వివాదం జరిగిన 48 గంటల్లోనే జడ్పీ సీఈఓపై బదిలీ వేటు పడటం జిల్లాలో రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆర్. రామచంద్రారెడ్డిని గత ఏడాది సెప్టెంబరు 22న అనంతపురం జడ్పీ సీఈఓగా నియమించారు. అయితే ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో అప్పట్లో విధుల్లో చేరలేదు. సెలవులు ముగించుకుని వచ్చిన ఆయన డిసెంబరు 28న ఆయన విధుల్లో చేరారు. ఆరు నెలలు కూడా తిరక్కుండానే బదిలీపై వెళ్లాల్సి వచ్చింది.

హీటెక్కిన ఫొటో పాలిటిక్స్.. 48 గంటల్లో వేటు..!

జడ్పీలో ఈనెల 21న జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ రోజు జడ్పీ ఛైర్‌పర్సన్ చాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండటం చూసి ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుబాటి వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు అభ్యంతరం తెలుపుతూ, గట్టిగానే ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయంలో జగన్ ఫొటో ఎలా పెడతారంటూ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలో సీఈఓ నుంచి సానుకూల దృక్పథంతో కూడిన సమాధానం రాకపోవడంపై ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. తర్వాత జగన్ ఫొటోను తొలగించినా...గత రెండు రోజులుగా జిల్లాలో ఫొటో రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు హాట్ హాట్ కామెంట్స్ చేస్తూ వచ్చారు. వైసీపీ మాజీ ఎంపీ మాధవ్ ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం మరింత హీటెక్కింది. రెండు రోజులుగా జిల్లాలో టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య జగన్ ఫొటో తొలగింపు మాటలు మంటలు రేపాయి. ఈ క్రమంలో జడ్పీలో ఫొటో వివాదం తలెత్తిన 48 గంటల్లోనే సీఈఓపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది.

సహనమే నా ఆయుధం

● ధర్మవరమే దాన్ని నాకు నేర్పింది ● మినీ మహానాడులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



మినీమహానాడులో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న చేనేత, టీడీపీ నాయకులు

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల వారిని వేధించడమే లక్ష్యంగా పాలన సాగించింది. ధర్మవరం టీడీపీ నాయకులు, కార్యకర్తలను మరీ ఎక్కువగా ఇబ్బందుల పాలు చేసింది. అయినా వారు టీడీపీని వీడలేదు. ఐదేళ్లపాటు సహనం పట్టారు. ఆ ఆయుధాన్ని ఉపయోగించడం నేను వారి నుంచే నేర్చుకున్నా. ఆ ఆయుధంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో వైసీపీకి కోలుకోలేని దెబ్బ కొట్టారు.' అని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గ మినీమహానాడు కార్యక్రమాన్ని స్థానిక మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మొదట ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిటాల శ్రీరా మ్ మాట్లాడుతూ.. ప్రజలను వైసీపీ నుంచి వియుక్తి కల్పించాలనే లక్ష్యంగా నాడు ఎన్నికల్లో పోరాటం చేశామని, ఎమ్మెల్యే పదవిని ఆశించలేదని అన్నారు. అయితే గత 11 నెలలుగా కొందరు డబుల్ గేమ్ ఆడుతూ రాజకీయాలు చేస్తున్నారని, వారిపట్ల సహనంగా ఉండాలని, ఎవరూ అధైర్య పడరాదని, త్వరలో మంచి రోజులు వస్తాయని అన్నారు. కార్యకర్తలకు ఏ సమయంలోనైనా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో నాయకులు స్వేచ్ఛగా కార్యాలయాలకు వెళ్లి ప్రజలకు కోసం పనిచేయించుకోవాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప మాట్లాడుతూ... ధర్మవరంలో కూటమి గెలుపు కోసం టీడీపీ కార్యకర్తలు చేసిన కష్టాన్ని ఎవరూ మరువలేరన్నారు. ధర్మవరంలో కార్యకర్తలు ఎదుర్కొంటున్న కష్టాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, మహానాడు అనంతరం ధర్మవరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధారాఘవ, నియోజకవర్గంలోని టీడీపీ మండల కన్వీనర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలోని 16 మందికి రూ.14.58 లక్ష ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని బాధితులకు పరిటాల శ్రీరామ్ అందజేశారు.

● ఘన సన్మానం

మినీమహానాడులో పరిటాల శ్రీరామ్‌ను ధర్మవరానికి చెందిన చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, సంధారవి, జింకా పురుషోత్తం, కొత్తపేట ఆది గజమాలతో సత్కరించారు.

న్యూస్ బాక్స్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

5న చలో విజయవాడ

పుట్టపర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జూన్ 5న నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రశాంతిగ్రామం వద్ద రాష్ట్ర కౌన్సిల్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో పీఆర్‌సీ, డీఏ, సీపీఎస్, ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కావున ఉద్యోగులు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి నిరంజనరెడ్డి పాల్గొన్నారు.

1/19 సర్క్యులర్ విజయంపై గేట్ మీటింగ్



గేటు మీటింగ్ నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరూ కలిసికట్టుగా పోరాటం చేయడం వల్లే 1/19 సర్క్యులర్ విజయం సాధించామని ఎన్ఎంయూ రీజనల్ నాయకులు ఎస్ఎంసాబ్ అన్నారు. ఈ మేరకు ధర్మవరం డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ నాయకులు మోహన్, ముత్యాలప్ప, డిపో చైర్మన్, అధ్యక్ష, కార్యదర్శులు హనుమాన్, ప్రభాకర్, మధు, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, హరి, డిపో నాయకులు శంకరయ్య, వైవీఎన్ రెడ్డి, గోపాల్, నారాయణస్వామి పాల్గొన్నారు.

27న చేతివృత్తిదారుల సమావేశం



మాట్లాడుతున్న సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళవారం చేతి వృత్తిదారుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక ఎన్టీఓహోం కార్యాలయ ఆవరణంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తిదారులపై నిర్లక్ష్యం వీడాలన్నారు. రజక, నాయిబ్రాహ్మణ, కుమ్మరి, వడ్రంగి, గొర్లపెంపకం, గీత కార్మికులు, మత్స్యకారులు చేతివృత్తిదారులు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాల తీరును నిరసిస్తూ చేతివృత్తిదారుల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, జిల్లా అధ్యక్షుడు నాగప్ప పాల్గొన్నారు.

కూటమి ఐక్యత విచ్ఛిన్నానికి వైసీపీ కుట్ర

ఓబుళదేవరచెరువు, మే 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నియోజకవర్గంలో కూటమి పార్టీల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి వైసీపీ కుట్ర పన్నుతోందని కూటమి నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం మండల కేంద్రంలో జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి, ఎస్సీ ఎస్టీ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసనాయక్, బీజేపీ కన్వీనర్ ఇడగొట్టు వీరాంజి మాట్లాడారు. నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదుకొంటున్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రమిస్తున్నారని అన్నారు. అయితే ఓ ప్రతికలో తప్పుడు కథనాలతో విభేదాలు సృష్టించడానికి వైసీపీ నాయకులు యత్నిస్తున్నారన్నారు. పసుపులేటి రమేష్‌బాబుకు జనసేన పార్టీతో సంబంధం లేదని, అతనికి కనీసం సభ్యత్వం కూడా లేదని మేకల్ ఈశ్వర్ పేర్కొన్నారు. పల్లె కుటుంబంపై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్ని చిచ్చులు పెట్టినా కూటమి ఐక్యతను దెబ్బతీయలేరన్నారు.



మాట్లాడుతున్న కూటమి నాయకులు

నేటి జిల్లాస్థాయి మహానాడుకు తరలిరండి

నల్లమాడ, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో కప్పలబండ పారిశ్రామిక వాడలో శనివారం ఉదయం పది గంటలకు జిల్లా స్థాయి మినీ మహానాడు సభను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహానాడుకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయవంతం చేయాలని కోరారు.

● ఓబుళదేవరచెరువు: పుట్టపర్తి సమీపంలో శనివారం నిర్వహించే జిల్లా స్థాయి మినీ మహానాడుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి.. విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల రెడ్డి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి ప్రకటనలో కోరారు.

కన్వీనర్‌గా యువతకు అవకాశం

నల్లమాడ, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కన్వీనర్‌గా యువతను నియమించే అవకాశాలున్నాయి. టీడీపీ నూతన కమిటీల ఎన్నిక ప్రక్రియలో యువత కు ప్రాధాన్యత ఇవ్వాలని.. పార్టీలో యువరక్తం నింపాలని మంత్రి నారా లోకేష్ ఇటీవల సూచించారు. దీంతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమచారం. సామాజిక సమీకరణాల దృష్ట్యా కన్వీనర్ నియామకం ఏ సమాజిక వర్గానికి దక్కుతుందో అన్న విషయంలో స్పష్టత రాలేదు.

వైసీపీ ప్రధాన కార్యదర్శిగా వెంకటరెడ్డి

నంబులపూలకుంట, మే 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల ప్రధాన కార్యదర్శిగా తనను ఎంపిక చేసినట్లు చేయ్యప్పగారిపల్లికి చెందిన దుద్దుకుంట వెంకటరెడ్డి ప్రకటనలో తెలిపారు. తన ఎంపికకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ సహకార కేంద్రం

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉచిత సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. బదిలీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ సబ్మిట్ చేయుటకు, బదిలీ ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో ఎరికలమ్మ

నంబులపూలకుంట, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లిలో శుక్రవారం ఎరికలమ్మ (ఆవుదేవత) విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించా రు. నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, శుక్రవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి దర్శనం కోసం మండలంలోని పలు గ్రామాల భక్తులు తరలివచ్చారు.

కిశోరి వికాసంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తనకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై బాలికలకు వేసవి శిక్షణ నిర్వహించారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో ఈ శిక్షణ చేపట్టారు. కిశోరి బాలికలు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, వృత్తివిద్యానైపుణ్యాలు, బాల్యవాహాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. బాలికలకు సమస్యలుంటే వెంటనే 1098, 1081, 100కు సమచారం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిశోరీ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళ పోలీసు చిట్టెమ్మ పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వేధింపులపై కేసు

కదిరిఅర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసముంటున్న శిరీషా, లక్ష్మీనారాయణదంపతులకు ఇద్దరు కుమార్తెలు. భర్తతో విభేదాలు రావడంతో శిరీషా మూడేళ్ల నుంచి కదిరిలోనే ఉన్న తన పుట్టినింటిలో ఉంటోంది. ఆమె ఫొటోలను లక్ష్మీనారాయణ అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి.. ఆమెకు వాట్సా్‌ప్‌లో పంపేవాడు. దీంతో విసుగుచెందిన ఆమె శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

అత్తింటివారిపై...

ధర్మవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారని మెగావత్ మమత టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. అనిల్‌కుమార్, మెగావత్ మమతలకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. భర్త, అత్త లక్ష్మీబాయి, ఆడబిడ్డ సంధ్య అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా తనను వేధిస్తున్నారని మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త, ఆడబిడ్డలపై కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు.

బోరుబావి ధ్వంసం

తనకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లిలో శ్రీనివాసాచారికి చెందిన వ్యవసాయ బోరుబావిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. తమ గ్రామం వద్ద 950 అడుగుల లోతు బోరు తవ్వామని, 40 బోరుపైపులు బిగించి పంట లు సాగుచేస్తున్నానని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్‌వైర్ కోసి, క్లాపులు ఇప్పి, 40 బోర పైపులను మోటారులోకి వదిలేశారని వాపోయాడు. కేబుల్ వైర్లు కూడా కత్తిరించి బోరులోకే వదిలేశారన్నారు. అంతేకాకుండా రాళ్లు వేసి బోరును పూడ్చినట్లు చెప్పారు. దీంతో తన కుటుంబం జీవనోపాధి కోల్పోయిందన్నారు. పోలీసులు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ కాలనీవాసులు

గొర్రెల మందను తొలగించండి

నల్లచెరువు (కదిరి), మే 23(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలం పంతులచెరువులోని ఎస్సీ కాలనీలోని శ్రీరాముని దేవాలయ ఆవరణంలో అక్రమంగా గొర్రెల మందను ఉంచుతున్నారని, దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఆ కాలనీ వాసులు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సోముశేఖర్ అనే వ్యక్తి ఆలయ ఆవరణంలో అక్రమంగా గొర్రెల మందను ఉంచుతున్నాడని, దీంతో ఆలయానికి వెళ్లడానికి, పూజలు నిర్వహించడానికి ఇబ్బందిగా మారిందని అన్నారు. ఆ మందను తొలగించాలని కోరగా.. అతను దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. దీంతో దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని, శనివారం ఆ అధికారులు ఆలయాన్ని పరిశీలించి, న్యాయం చేయమని హామీ ఇచ్చారని చెప్పారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



పుట్టపర్తి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలు గురించి ఆర్ఎం మధుసూధన్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో, పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మరుగుదొడ్ల శుభ్రతను మెరుగుపరచాలన్నారు. బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరు వేళలు తెలిపే లా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట డీఎం ఇనయతుల్లా, ఏఓ ఉషారాణి, అసిస్టెంట్ మేనేజర్ హరిత, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మహిళా కూలీలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ముదిగుబ్బ, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సిఐ శివరాముడు సూచించారు. శుక్రవారం అధిక సంఖ్యలో మహిళా కూలీలను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఇలా ఓవర్ లోడ్‌తో వెళ్లడం జరిగే అనర్థాలపై ఆ కూలీలకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

సిబ్బందిలేక సచివాలయం వెలవెల

నంబులపూలకుంట, మే23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమల సచివాలయంలో సిబ్బంది ప్రజలకు సరిగా అందుబాటులో ఉండటంలేదనే విమర్శలున్నాయి. నూతనంగా రేషన్‌కార్డుల మంజూరు, కార్డుల్లో చేర్పులు, మార్పులు చేయించుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తుర్వులు విడుదల చేసింది. దీంతో తాము పలుమార్లు కార్యాలయానికి వెళ్లినా.. సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, దీంతో వెనుదిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. వెలిచెలమలతో పాటు గౌకనపేట సచివాలయానికి ఒకే డిజిటల్ అసిస్టెంట్ ఉండడంతో ఎక్కడ ఉంటారో అర్థం కావడంలేదని ఆవేదన చెందారు. దీంతో ఆంధ్రజ్యోతి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆ సచివాలయాన్ని విజిట్ చేసింది. ఆ సమయంలో సిబ్బంది ఒక్కరు కూడా ఆ కార్యాలయంలో లేరు. ఈ విషయంపై ఫోన్‌లో ఎంపీడీఓ పార్థసారధిని వివరణ కోరగా.. పరిశీలించి, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాళీగా ఉన్న సచివాలయం

యోగాతో మానసిక ప్రశాంతత: ఎస్పీ



పట్టపర్తిలో యోగా చేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక యుగంలో యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్పీ వీ.రత్న పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లాపోలీసు కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, ఆదినారాయణ, ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు సునీత, నరేందర్‌రెడ్డి, బొజ్జప్ప, ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్సైలు లింగన్న, మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● యోగాపై చైతన్యం అవసరం: కలెక్టర్

పుట్టపర్తిటౌన్: సమాజంలో ప్రతిఒకరు వయస్సుతో నిమిత్తం లేకుంగా యోగాసనాలు చేస్తూ, ఆరోగ్యం కాపాడుకోవడానికి చైతన్యవంతులు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలో యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షించారు.

కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాంధ్ర కార్యక్రమాన్ని జూన్ 21 వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. యోగాంధ్రా యాప్‌లో ఆసక్తికలవారి పేర్లను నమోదు చేయించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రతివార్డు, సచివాలయాల పరిధిలో ఓ యోగా శిక్షకుడ్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈయోగా కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ఇందులో ప్రజలు, ప్రజాప్రతినిధిలు, స్వచ్ఛంద, సేవా సంస్థలు, విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని కోరారు.

● గాండ్లపెంట: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అధికారులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ బాబు రావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు యోగ సాధన చేశారు.

● ముదిగుబ్బ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు ఇందులో తహసిల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ దివాకర్, ఎంఈఓ రమణప్ప, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, యోగా ట్రైనర్లు మహేష్, ప్రభావతి, కుళ్లాయిరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

● నల్లచెరువు (కదిరి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నల్లమాడ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ ఆజాద్, ఎంఈఓ వేమనారాయణ, సర్పంచ్ రమావత్ భారతి, ఉపాధ్యాయులు చాప్లానాయక్, రవీంద్రారెడ్డి, రామాంజనేయులు, పోలయ్య, అన్నిశాఖలాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా నిడిమామిడమ్మదేవి ఉత్సవాలు



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మడకశిర రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మానిపల్లి లక్ష్మీనిడిమామిడమ్మదేవి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు విశేషపూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాల అనంతరం గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఐముక్తేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెనుకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన ఐముక్తేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు కన్నాస్వామి, మూర్తి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పూలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు.

యోగాతో మంచి ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

హిందూపురం, మే 23(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షణ కార్యదర్శి బద్రీనారాయణ, మహేంద్ర అన్నారు. శుక్రవారం బైపాస్‌రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం వద్ద యోగాసనాలు వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మాసోత్సవ యోగా వేడుకలు నిర్వహిస్తోందన్నారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సోమందేపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు, చల్లాపల్లి, సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. సిబ్బంది బయోమెట్రిక్‌లో హాజరైన సమయం, రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీఓ మట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనివేళలను పాటించాలన్నారు. ప్రజల కు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలను అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమిటీ ఎన్నిక



ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ సభ్యులతో నరసింహమూర్తి

పెనుకొండ, మే 23(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ పట్టణ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో 13మంది సభ్యులతో కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రదీప్‌కుమార్, రహిమాన్, ఉపాధ్యక్షులుగా సర్వర్‌బాషా, రంజిత్‌కుమార్, నరేష్, అహ్మద్, సహాయ కార్యదర్శిగా గణేష్, అనీల్, మనోహర్, వసంత్, ధనుంజయ, సంతోష్ ఎంపికయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం

అగళి, మే 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కసాపురం గ్రామ అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ లీలావతి ఆధ్వర్యంలో కిశోరీకి వికాసం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సమ్మర్ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యకర్త తిమ్మక్క, ఆశా కార్యకర్తలు, బాలికలు, వారి తల్లులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఎస్సీ కాలనీ వద్ద వంగిన విద్యుత్ స్తంభం

మడకశిర రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీ కోడిగేపల్లి ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఆ స్తంభానికి ఉన్న వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పంటకుంటలు రైతులకు ప్రయోజనకరం

● భూగర్భ జలాలు పెరుగుతాయి
● ప్రతి రైతూ పొలంలో తవ్వించుకుంటే మేలు



నడింపల్లి వద్ద రైతు కిష్టప్ప పొలంలో తవ్విన పంకుంట

సోమందేపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా పొలాల్లో పంట కుంటలు నిర్మాణం చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వాటిని నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. భూమిమీదపడే ప్రతి వర్షం నీటి బొట్టును ఒడిసిపట్టి ఇంకిపజేసేందుకు ప్రయోగాత్మకంగా ఉపాధిహామీ ద్వారా పంట కుంటల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రతిరైతు తమ పొలాల్లో అనువైన ప్రాంతంలో కుంటలు తవ్వితే, తద్వారా కలిగే ప్రయోజనాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వీటి నిర్మాణం ద్వారా వర్షంపునీటిని నిలువచేసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా భూగర్భ జలాలను పెంపొందించేందుకు నీరు ఉపయోగపడతాయి. భారీ వర్షాలకు భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. వర్షం నీరు పొలందాటి వెళ్లకుండా కాపాడుకోవచ్చు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చిన మట్టి కుంటలో చేరిఅనంతరం ఎరువుగా ఉపయోగపడుతుంది. చాలా మంది రైతుల్లో సరైన అవగామన లేకపోవడంతో భూమి వృథా అవుతుందన్న భ్రమలో పంటకుంటల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. సోమందేపల్లి మండలానికి 311 పంటకుంటలు మంజూరయ్యాయి. వాటిలో 247 వివిధ దశల్లో ఉండగా, 57పంట కుంటలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఖరీఫ్ ముంచుకొస్తున్న నేపథ్యంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పంటకుంటల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. గతంలో గ్రామసభలు ఏర్పాటుచేసి అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అయితే ప్రతిగ్రామంలో వందశాతం పంట కుంటలను నిర్మించుకునేలా అధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. పంట కుంట నిర్మాణానికిరైతు పైసా ఖర్చుచేయాల్సిన అవసరం లేదు. ఉపాధికూలీలే వాటిని నిర్మిస్తారు. 6/6 చ.మీ. వెడల్పు, 3 మీటర్లలోతు ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం: సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ

పొలాల్లో పంట కుంటలు నిర్మించుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. భూమి పోతుందని రైతులు ముందుకు రావడం లేదు. పంట కుంటల నిర్మాణంవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. వందశాతం పంట కుంటలు నిర్మించుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.

జిల్లా మహానాడును జయప్రదం చేద్దాం

● టీడీపీ నాయకుల పిలుపు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, మే 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో శనివారం జరిగే జిల్లా మహానాడు సభను జయప్రదం చేద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద ముఖ్యనాయకులు మాట్లాడుతూ శనివారం పుట్టపర్తిలో జరిగే సభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్దామన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా అభినందన తీర్మానం ఉంటుందన్నారు. అలాగే ఈనెల 27నుంచి 29వరకు కడపలో జరిగే రాష్ట్రస్థాయి మహానాడు సభకు పంచాయతీ నుంచి వార్డుల నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్, కార్పొరేషన్ డైరెక్టర్‌లు ఆనంద్, గంగాధర్, నాయకులు రామాంజినమ్మ, ప్రెస్‌వెంకటేశ్, రంగారెడ్డి, జయప్ప, మంజునాథ్, సిద్ధు, కిష్టప్ప, హెచ్‌ఎన్ రాము, ఐటీడీపీ రామాంజనేయులు, శ్రీదేవి, ఉమాశంకర్‌రెడ్డి, చిక్కీరప్ప పాల్గొన్నారు.

అమరాపురం: పుట్టపర్తిలో నిర్వహించే జిల్లా మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్ పిలుపునిచ్చారు. మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెనుకొండ: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో శనివారం నిర్వహించే జిల్లా మహానాడుకు పెనుకొండ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, హనుమన్న కమిటీ సభ్యులు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పార్టీ కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, శ్రీరాములు యాదవ్ ఓ ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం 8-30 గంటలకు అన్ని మండలాలకు చెందినవారు పెనుకొండ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు.

ఇతర ప్రాంతాలవారిని అనుమతించొద్దు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న నాయీబ్రాహ్మణులు

అమరాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): సెలూన్ షాపుల ఏర్పాటుకు ఇతర ప్రాంతాలవారిని అనుమతివ్వవద్దని షిర్డీ నాయీబ్రాహ్మణ సంఘం వారు పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి సెలూన్‌లు నిర్వహిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో దాదాపు 30 షాపులు ఉన్నాయన్నారు. అనేక మంది యువకులు ఈ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. సంఘం అధ్యక్షుడు గణేష్, తిప్పేస్వామి, నరసింహమూర్తి, ప్రభాకర్, మారుతి, అశోక్, నరేష్, నాగరాజు, సంజయ్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయవద్దు

పావగడ, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపై పోలీసు అధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయరాదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎంఏ సలీం సూచించారు. రాష్ట్ర మానవహక్కుల నివేదికలోని అంశాలను పరిగణించిన అనంతరం ఈ ఆదేశాలను వెల్లడించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏదో సమస్యపై పోలీసులను నమ్ముకుని స్టేషన్‌కు వస్తే వారికి మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య అవినాభావ సంబంధాలు ఉంటేనే పోలీస్‌శాఖకు ప్రజలకు సముచిత న్యాయం చేకూరుతుందని ఆయన అన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గోరంట్ల, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయం వద్ద ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ దేవరాజు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో అనంతపురం సవీరా ఆసుపత్రి వైద్యులు చికిత్సలు చేశారు. 60మందికి గుండె, కంటి వైద్య పరీక్షలు చేశారు. శస్త్రచికిత్సలకోసం ఐదుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వైద్యులు రామ్, సిబ్బంది అనూషా, ప్రతిమ, నరేంద్ర, ఆలయకమిటీసభ్యులు పాల్గొన్నారు.

రేపు ఏకాదశ రుద్రాభిషేకం

పరిగి, మే 23(ఆంధ్రజ్యోతి): గొరవనహళ్లి గ్రామంలో వెలసిన మహాలక్ష్మీ ఆలయంలో బ్రహ్మసూత్ర లింగానికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు డా.కె హరిప్రసాద్ శర్మ, ఆలయ అర్చకులు బసవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి గుడిప్రాంగణంలో ఉదయం 7 గంటలకు శోభాయాత్ర, గోపూజ, మొక్కలు నాటే కార్యక్రమం, 8గంటలకు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

ఎంపీ బీకేకు సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న ఫార్మా కంపెనీ ప్రతినిధులు

పెనుకొండ, మే 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని బెంగళూరుకు చెందిన డీజే కోకోనట్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతపురంలోని బీకే స్వగృహానికి వచ్చిన ఫార్మా కంపెనీ చైర్మన్ డేవిడ్ లోగో, జీఎం రఘునాథన్ శ్రీధర్, రీజనల్ మేనేజర్ రాకేష్, సోమిరెడ్డి బీకేను కలిసి ఇటీవల జరిగిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతులసమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకొచ్చినందుకు అభినందిస్తూ పూలమాలలువేసి శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెనుకొండ, మే 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు, రోగులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షలకు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు, రోగులకు నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి సహకరించిన సత్యసాయి సేవా సమితి మాజీ కన్వీనర్ రామక్రిష్ణ, కుటుంబ సభ్యులకు సేవాసమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంజీఎంలో ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్

హిందూపురం, మే23(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం క్రీడా మైదానంలో ఆర్డీసీ సౌజన్యంతో హిందూపుర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసి గ్రాస్‌రూట్ ప్రోగ్రాం నిర్వహించారు. చిన్నారులతో మొదలుకొని యువత వరకు ఫుడ్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో 80 మంది క్రీడాకారులు పాల్గొనగా, పది మంది కోచ్‌లు పర్యవేక్షించారు. శుక్రవారం పలు టీంలు ఫుట్‌బాల్ ఆడారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్ కుమార్, ట్రెజరర్ శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీం, పీడీలు లోకనాథ్, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వండి

సోమందేపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో పనిచేస్తున్న కూలీలకు బకాయిపడ్డ వేతనాలు, పనిముట్లు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లుగా పనిముట్లను అందజేయలేదన్నారు. ఎనిమిది వారాలుగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే పేస్లిప్‌లు, సమ్మర్ అలవెన్స్, నీళ్లు, మజ్జిగ బిల్లులు, గడ్డపార పదును, మెడికల్ కిట్, ప్రమాద బీమా ఊసేలేదని వాపోయారు. సమస్యల సాధనకు 26వ తేదీ గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రిజర్వాయర్ వద్దు: గుడిని, గ్రామాన్ని ముంచే రిజర్వాయర్ వద్దని పెద్దన్న అన్నారు. రిజర్వాయర్ నిర్మాణంపై జోరుగా ప్రచారం జరుగుతోందన్నారు. గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం వల్ల గ్రామం ముంపునకు గురవుతుందన్నారు. రైతులు, ప్రజలు, భూములు, ఆస్తులు వదిలి వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. గ్రామాన్ని, గుడిని రక్షించేందుకు ప్రజలు సమాయత్తం అయి ఉన్నారన్నారు. మంత్రి సవిత గ్రామస్థులకు అండగా నిలవాలన్నారు. నాయకులు కొండారెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పెద్దన్న



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, ప్రజలు

ఘనంగా తిరంగా ర్యాలీ

మడకశిర టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో బాగంగా త్రివిధ దళాలకు మద్దతుగా శుక్రవారం పట్టణంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపటారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అమరాపురం బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి దేశ సైనికులకు మద్దతుగా నినాదలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో సమావేశం నిర్వహించారు. వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళి అర్పించారు. నియోజకవర్గంలోని 30 మంది విశ్రాంత సైనికులను సన్మానించారు, దేశ భద్రత కోసం అందరూ ఐక్యంగా ఉండాలని వక్తలు అన్నారు, బీజేపీ నాయకులు పురషోత్తం, ఉమేష్ చంద్ర, రామదాసరావు, జయరాంగౌడ, ధనుంజయ పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం



ట్రాక్టర్‌తో రోడ్డుకు మట్టివేయిస్తున్న జడ్పీటీసీ ఉమేష్, గ్రామస్థులు

అగళి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుసాంగనపల్లి గ్రామ ప్రజలు జడ్పీటీసీ ఉమేష్‌ను రోడ్డు సమస్య పరిష్కరించాలని విన్నవించారు. కురసాంగనపల్లి నుంచి హంద్రీనీవా కాలువ వరకు మట్టిరోడ్డు గుంతల మయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. సమస్యను జడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి శుక్రవారం గ్రావెల్ మట్టిని వేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆ గ్రామ ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసచారి, కృష్ణప్ప, రామనపల్లి, పంచాయతీ కమిటీ అధ్యక్షులు శివన్న, ఉపాధ్యక్షులు అంజన్న, వీరకేతరాయప్ప, ఆనంద్, ఉమేష్, రంగనాథ్, నాగేష్, జుంజేగౌడ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో ఎలుగుబంటి



పాఠశాలలో ఉన్న ఎలుగుబంటి (వృత్తంలో..)

మడకశిర టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసిద్దార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోకి గురువారం రాత్రి ఎలుగుబంటి ప్రవేశించింది. అమరాపురం-మడకశిర ప్రధాన రాహదారి పక్కనే పాఠశాల ఉండడంతో రాహదారిపై వెళుతున్న పలువురు ఎలుగుబంటిని గమనించారు. జనవాసంలోకి ఎలుగుబంటి రావడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలోనే ప్రభుత్వ ఆసుపత్రి ఉండడంతో పాటు పోలీస్ స్టేషన్ కోర్టు పక్కనే ఉండడంతో విషయం తెలుసుకొని ప్రజలు అక్కడి చేరుకొన్నారు. ఆటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించినా వారి సెల్‌ఫోన్‌లు స్విచ్ ఆఫ్ అని వచ్చినట్లు పలువురు తెలిపారు. పాఠశాల గేటు తీయడంతో రాత్రి 12 గంటల సమయంలో అక్కడి నుంచి మడకశిర కొండపైకి వెళ్లినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

అగళి, మే 23(ఆంధ్రజ్యోతి): మండలం ఇనగలూరు గ్రామ సమీపంలో శుక్రవారం జూదమాడుతున్న ఎనిమిది మందిని ఎస్ఐ వీరేష్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.2,350 స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖరీఫ్‌లో వర్షం.. రైతుల్లో హర్షం

పావగడ, మే 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభకాకుండానే వర్షాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 20 నుంచి మే 20వరకు కురిసిన వర్షాలకు రైతులు తమ పొలాలను చదును చేయడంలో నిమగ్నమయ్యారు. కసుబాలో 41మి.మీ, నాగలమడక 88.4, అర్సికెర 132.2, వైఎన్‌హొసకోట 144.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాశాఖ అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన అన్నిరకాల విత్తనాలు సబ్సిడీ ధరలతో వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి పొందటానికి అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి అజయ్‌కుమార్ తెలిపారు.

1 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ: ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ సబ్సిడీ ధరతో జూన్ 1నుంచి రైతులకు అందజేస్తామని వ్యవసాయశాఖ అధికారి అజయ్‌కుమార్, ఏఓ అశోక్ తెలిపారు. లింగదహళ్లి, వైఎన్‌హొసకోట, నాగలమడక, పావగడ, మంగళవాడ కేంద్రాలలో విత్తన వేరుశనగ పంపిణీ చేయడానికి ఏర్పాటు చేశామన్నారు. కదిరి లేపాక్షి రకం వేరుశనగ జనరల్ రైతులకు 30కేజీల ప్యాకెట్ రూ.2,880, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2610, టిఎంవి-2 రకం వేరుశనగ జనరల్ రైతులకు రూ.2130, ఎస్సీ ఎస్టీలకు రూ.1920 లభిస్తుందన్నారు. ఒక్కో రైతుకు ఐదెకరాలకు 10ప్యాకెట్లు అందజేస్తామని తెలిపారు. రైతులు పట్టా పాసు పుస్తకాలతో వ్యవసాయశాఖ కార్యాలయంలో రసీదులు పొంది వేరుశనగ తీసుకోవచ్చని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నరసింహమూర్తి (ఫైల్)

అగళి, మే 23(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక నరసింహమూర్తి(45) అనే వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ బషీర్ తెలిపిన మేరకు అగళి మండలం హళ్లికెర గ్రామానికి చెందిన నరసింహమూర్తి తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. గురువారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో బాధను భరించలేక విషద్రావకం తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి శిర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నరసింహమూర్తికి భార్య హనుమక్క, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రొద్దంలో నడుచుకుని వెళ్తున్న కృష్ణప్ప అనే వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు రొద్దం గ్రామానికి చెందిన కిష్టప్ప ఉదయం రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా ధర్మవరం-పావగడ వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వారిని హిందూపురం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.